
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



కర్ణాటక వార్తలు

మంగళవారం 12 ఆగస్టు 2025

బాల్య వివాహాలను అరికట్టాలి

● గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

: బాలల సంరక్షణాధికారి నాగప్ప

8

పొగాకు నిల్వలపై దాడులు



పొగాకును పరిశీలిస్తున్న బళ్లారి ఎస్పీ శోభారాణి



నువ్వా..నేనా..?

- శాసనసభ సమావేశాలు ప్రారంభం
- దివంగతులైన ప్రముఖులకు సభ్యుల నివాళి
- నేడు సీఎల్పీ భేటీ.. హాజరుకానున్న బీజేపీ ఎమ్మెల్యేలు
- కత్తులు నూరుతున్న అధికార, ప్రతిపక్షాలు
- చర్చకు రానున్న యూరియా కొరత, శాఖల్లో అవినీతి, ఆర్సీబీ తొక్కిసలాట, ధర్మస్థళ వివాదాలు



బెంగళూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉభయసభల్లో ఇటీవల నాలుగు నెలలుగా స్వర్గస్తులైన ప్రముఖులకు నివాళి అర్పించే సంతాప తీర్మానం కొనసాగింది. అసలు కలాపాలు మంగళవారం నుంచి కొనసాగనున్నాయి. ఈలోపే అధికార పార్టీ తప్పిదాలను శాసనసభ వేదికగా తిప్పికొట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. బీజేపీ, జేడీఎస్ పార్టీలు సంయుక్తంగా అన్ని అంశాల్లోనూ అధికార పార్టీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని తీర్మానించాయి. ప్రధానంగా రాష్ట్రంలో సంతృప్తికరమైన వర్షాలు కురిశాయి. పంటలసాగు నెలరోజుల ముందునుంచే ప్రారంభమయ్యాయి. ఇలా సాగు విస్తీర్ణం పెరిగింది. అన్నదాత సంతోషంగా ఉన్నాడు. కానీ రసాయన ఎరువుల కొరత వేధిస్తుండడంతో రోజూ రాత్రింబవళ్లు తేడా లేకుండా ఎరువుల దుకాణాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. దీనిపై ప్రతిపక్షాలు పోరాటానికి సిద్ధమయ్యాయి. రాష్ట్రంలో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే మైసూరు జిల్లా నంజనగూడు గోడౌన్ నుంచి కేరళకు అక్రమమార్గంలో తరలించడాన్ని రైతు నేతల చొరవతో అధికారులు పట్టుకున్నారు. కేరళపట్ల రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక అభిమానం చూపుతోందని అన్నదాతలు మండిపడుతున్నారు. ఆర్సీబీ విజయోత్సవాల వేళ తొక్కిసలాటలో 11మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. తప్పు చేసిందెవరనేది అందరికీ తెలిసినా... పోలీసులు, ఆర్సీబీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యమే కారణంగా చూపారు.

ధర్మస్థళ వివాదంపై భగ్గుమంటున్న బీజేపీ

వీటన్నింటికంటే ధర్మస్థళలో కొనసాగుతున్న వివాదంపై బీజేపీ సభలో తీవ్రమైన చర్చకు డిమాండ్ చేయాలని భావిస్తోంది. 11ఏళ్లక్రితం పదవీ విరమణ చేసిన పౌరకార్మికుడు ఫిర్యాదు చేశారని ధర్మస్థళ వివాదంపై బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడదలిచింది. ఒక వ్యక్తి ఏకంగా దశాబ్దాలకాలంగా ధార్మికంగా పేరొందిన ప్రదేశంపై దాడి చేసేలాంటి చర్యకు కారకులయ్యారని ప్రభుత్వం వెంటనే సిట్ ఏర్పాటు చేసిన విధానంపైనా పోరాటం చేయదలిచింది. ఇప్పటివరకు 16చోట్ల తవ్వకాలు జరిపితే ఒక చోట మాత్రమే ఒక అస్థిపంజరం లభించిందని, ఇలా అనుమానం పేరుతో అడవి అంతా తవ్వుకుంటూపోతారా..? అంటూ శాసనసభ వేదికగా పోరాటానికి బీజేపీ సిద్ధమైంది. దీంతోపాటు మంగళూరు, మైసూరులలో డ్రగ్ మాఫియా తీవ్రరూపం దాల్చినా రాష్ట్రపోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని చర్చకు డిమాండ్ చేయదలిచినట్లు తెలుస్తోంది. బెంగళూరు పాలికెను విభజించి గ్రేటర్ బెంగళూరు అథారిటీగా మార్చి అందుకు అనుబంధంగా ఐదు పాలికెలను ఏర్పాటు చేయడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రూ.50కోట్ల గ్రాంటు కేటాయించడాన్ని తీవ్రంగా తపుబడుతోంది. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికల వరకు మాత్రమే రాజకీయ పార్టీలకు అనుగుణంగా ఉండాలని, అభివృద్ధిలోనూ ఇలాంటి తారతమ్యం చూపడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించనున్నారు.ఇలా ప్రతి అంశంలోనూ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, శాసనసభ, విధానపరిషత్‌లో పోరాటం కొనసాగించాలని ప్రతిపక్షాలు తీర్మానించాయి.

చర్చకు రానున్న 27 బిల్లులు

శాసనసభ కలాపాలలో 27 బిల్లులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఉభయసభలలోనూ ఆమోదం పొందేందుకు కసరత్తు సాగిస్తోంది. బిల్లులపైనా ప్రతిపక్షాలు అడ్డుకోవాలని భావిస్తున్నాయి. అయితే శాసనసభలో కాంగ్రెస్ సంపూర్ణ మెజారిటీ ఉండడంతో ఎటువంటి ఢోకా ఉండదు. కానీ పరిషత్‌లో ప్రతి బిల్లును అడ్డుకోవాలని భావిస్తున్నారు. ఇటీవలే ఢిల్లీ వెళ్లిన ప్రతిపక్షనేత ఆర్ అశోక్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో శాసనసభలో ప్రస్తావించాల్సిన అంశాలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటానికి సంబంధించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ కసరత్తు

ప్రతిపక్షాల వ్యూహాలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. సీఎల్పీ సమావేశం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. శాసనసభలో చర్చకు వచ్చే అంశాలపై సీఎల్పీలో సభ్యులందరికీ అవగాహన కల్పించదలిచారు. ప్రతి అంశంలోనూ కనీస అవగాహన కలిగి ఉండాలని, చర్చలలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యేలను సూచించదలిచారు. ప్రతి సభ్యుడు సభలో తప్పనిసరిగా ఉండాలని తీర్మానించదలిచారు. ప్రతిపక్షాలు ఏ విధమైన అంశాలను ప్రస్తావించినా సంఘటితంగా తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని సూచించదలిచారు. మరోవైపు బీజేపీ కూడా ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశానికి సిద్ధమైంది. సభలో ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు దీటుగా సమాధానం చెప్పాలని సూచిస్తోంది.

తొలిరోజు నివాళితో ముగిసిన సభ

శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజు సోమవారం ఉభయసభల్లో ప్రముఖులకు నివాళులు అర్పించారు. ఏప్రిల్ నుంచి ఇటీవల దాకా స్వర్గస్తులైన ప్రముఖులను ఉభయసభలు స్మరించుకున్నాయి. విధానపరిషత్ మాజీ సభాపతి డేవిడ్ సిమయోన్, డాక్టర్ ఎన్ తిప్పణ్ణ, మాజీ ఎమ్మెల్యే బేగాన రామయ్య, అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కే కస్తూరి రంగన్, ప్రముఖ సాహితీవేత్తలు జీఎస్ సిద్ధలింగయ్య, హెచ్ఎస్ వెంకటేశమూర్తి, వ్యవసాయశాస్త్రవేత్త ప్రొఫెసర్ సుబ్బణ్ణ అయ్యప్పన్, పరమాణు శాస్త్రవేత్త డాక్టర్ ఎంఆర్ శ్రీనివాసన్, ప్రముఖ నటి డాక్టర్ బీ సరోజాదేవిలకు సంతాపం తెలిపారు. శాసనసభలో స్పీకర్ యూటీ ఖాదర్ సంతాపతీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రం కోసం పాటుపడినవారితోపాటు సరికొత్త పరిశోధనలతో దేశానికి వన్నె తెచ్చారని శాస్త్రవేత్తలను కొనియాడారు. నాలుగు భాషలలో మేటినటిగా డాక్టర్ బీ సరోజాదేవి పేరొందారన్నారు. సీఎం సిద్దరామయ్య, ప్రతిపక్షనేత అశోక్, హోం మంత్రి పరమేశ్వర్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ పార్టీల ఎమ్మెల్యేలు ప్రముఖుల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఇదే సందర్భంలోనే గుజరాత్‌లో ఎయిరిండియా విమానం దుర్ఘటనలో మృతి చెందిన వారికి, ఆర్సీబీ విజయోత్సవాల వేళ 11మంది అమాయకులు మృతి చెందారని వారికి నివాళి అర్పించారు. పరిషత్‌లో సభాపతి బసవరాజహొరట్టి కలాపాలు ప్రారంభం కాగానే సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభా నాయకుడు మంత్రి బోసరాజు, ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, సీటీ రవి, మంత్రి ఈశ్వర్‌ఖండ్రె, సలీం అహ్మద్, శరవణ, ఐవాన్ డిసౌజా, ఉమాశ్రీ తదితరులు సంతాపం తెలిపారు. చివరగా సభాపతి బసవరాజహొరట్టి మాట్లాడుతూ సంతాప సందేశాలను మృతుల కుటుంబాలకు పంపుతామన్నారు. ఉభయసభల్లోనూ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు.



నివాళి అర్పిస్తున్న సీఎం సిద్ధరామయ్య, స్పీకర్ యూటీ ఖాదర్, మంత్రులు, సభ్యులు

విమర్శించడమే ఆయన నైజం



- స్వపక్షం.. ప్రతిపక్షం తేడా ఉండదు
- తరచూ వివాదాస్పద వ్యాఖ్యలతో దాడులే
- గతంలో సీఎం, డీసీఎంపై విమర్శలు
- ఈసారి ఏకంగా అధిష్టానంపైనే..
- రాజణ్ణకు ఉద్వాసనతో ఉలిక్కిపడ్డ పార్టీ నేతలు
- రెండేళ్ల పాలనలో రెండో వికెట్

బెంగళూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆయన వ్యాఖ్యలు ఎప్పుడూ ఎదుటివారికి దూసుకుపోయేలా ఉంటాయి. సొంతపార్టీ ప్రతిపక్షం అనే తేడా ఉండదు... ఎవరికైనా ఒకేవిధంగా సమాధానమిస్తారు... 26 నెలపాటు మంత్రిగా కొనసాగిన కేఎన్ రాజణ్ణ, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అత్యంత ఆప్తుడనే గుర్తింపు పొందారు. కానీ ఇటీవల రెండువారాలుగా ముఖ్యమంత్రితోనూ సన్నిహితంగా లేరనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తుమకూరు జిల్లా మధుగిరి శాసనసభ స్థానం నుంచి రాజణ్ణ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. సిద్దరామయ్య ముఖ్యమంత్రి కాగానే మంత్రుల జాబితాలో రాజణ్ణది కూడా ప్రాధాన్యత క్రమంలోనే ఉండేది. ఆయనకు అత్యంత ఇష్టమైన సహకారశాఖ మంత్రి పదవి దక్కింది. తుమకూరు డీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గాను, అపెక్స్‌బ్యాంకు ఛైర్మన్‌గాను రాజణ్ణ కొనసాగారు. సహకారరంగంలోనే ఆయను సుదీర్ఘ కాలం 40ఏళ్లుగా వివిధ హోదాల్లో కొనసాగారు.

● 2018-19ల మధ్యన జేడీఎస్‌తో కలసి కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం వేళ సొంత జిల్లాకు చెందిన పరమేశ్వర్ హోం మంత్రిగా వ్యవహరించారు. ఆయన బుగ్గకారులో తిరగడం తప్ప సాధించింది ఏమీ లేదని రాజణ్ణ విమర్శించారు. ఇటీవల రెండేళ్లలో రాజణ్ణ పలు సందర్భాల్లో సొంత పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతోనే వివాదానికి కారకుడయ్యారు. కేపీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని బహిరంగంగా ప్రకటించారు. పరోక్షంగా డీకే శివకుమార్‌కు రెండు పదవులు ఉన్నాయని విమర్శించారు.

● నాయకత్వ మార్పునకు అవకాశమే లేదని, ఐదేళ్లు సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉంటారని పలు సందర్భాల్లో బహిరంగంగా ప్రకటించారు. ఎస్సీ సామాజికవర్గం మంత్రులతో విందు వ్యవహారంలోనూ కీలక భూమిక పోషించారు. కానీ మాజీ ప్రధాని దేవేగౌడ పట్ల అనుచిత వ్యాఖ్యలు ఒకానొక సందర్భంలో సొంతపార్టీ నాయకులనుంచి కూడా విమర్శలు ఎదుర్కొన్నారు. ఇటీవల హనీట్రాప్‌కు గురైనట్లు ఆరోపణలు రావడంతో విచారణలకు డిమాండ్ చేశారు. అయితే అటువంటి ప్రక్రియ సాగలేదని పోలీసులు తేల్చిచెప్పారు.

● తాజాగా సెప్టెంబరులో రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త క్రాంతి ఏర్పడనుందని, అది నాయకత్వ మార్పా లేదా మరిన్ని అంశాలా అనేది ఇప్పుడే చెప్పలేనంటూ దాటవేశారు. ఈ అంశం హల్‌చల్ చేసింది. నాయకత్వ మార్పుపై రాష్ట్రంలో తరచూ విమర్శలు వస్తుండడంతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలా, ఎమ్మెల్యేలు, మంత్రులతో ముఖాముఖి నిర్వహించారు. పార్టీ పదవిలో ఉన్నవారు ఎమ్మెల్యేలతో ఎలా సమీక్షలు జరుపుతారని రాజణ్ణ ప్రశ్నించారు. ఈ అంశాన్ని అధిష్టానం తీవ్రంగా పరిగణించింది.

ముందే సీఎంతో భేటీ..!

అయితే సీఎంను ఉదయమే రాజణ్ణ భేటీ అయినట్లు తెలుస్తోంది. అధిష్టానం నీ పట్ల సీరియస్‌గా ఉందని ఏం చేయాలంటూ కోరినట్లు తెలుస్తోంది. అందుకు మీ నిర్ణయం చెప్పండి... అధిష్టానం విషయం పక్కనపెట్టండి... మీరు రాజీనామా చేయాలంటే ఈ క్షణమే చేస్తానంటూ బదులిచ్చినట్లు తెలుస్తోంది. ఇలా 26 నెలల సిద్దరామయ్య పాలనలో రెండో వికెట్‌గా రాజణ్ణ మంత్రివర్గం నుంచి నిష్క్రమించారు. 2024 ప్రారంభంలోనే మంత్రి నాగేంద్ర పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే.

● తాజాగా రాజణ్ణ, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జాతీయస్థాయిలో ఓట్ల చౌర్యంపై పోరాటం చేస్తున్నారు. బెంగళూరు పరిధిలోని మహదేవపురలో ఓట్ల చౌర్యం జరిగిందని రాహుల్‌గాంధీ గణాంకాలతో వివరించారు. అదే రోజున రాజణ్ణ 2024లో రాష్ట్రంలో మన ప్రభుత్వమే ఉందని, అప్పుడు అందరూ కళ్లు మూసుకున్నారా..? ఇప్పుడు ఆరోపణలు చేసేందుకంటూ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాహుల్‌గాంధీని విమర్శించడాన్ని పార్టీ జాతీయ కమిటీ తీవ్రంగా పరిగణించింది. ఈమేరకు ముఖ్యమంత్రికి అధిష్టానం ఆదేశాలు జారీ చేశారు. వెంటనే రాజణ్ణను మంత్రివర్గం నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేరుగా సోమవారం గవర్నర్‌కు రాజణ్ణను తొలగించేలా విన్నవించారు. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్ ఆదేశాలు జారీ చేశారు. మంత్రి కేఎన్ రాజణ్ణను కేబినెట్‌నుంచి తొలగించాలని తక్షణం అమలులోకి వచ్చేలా ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు మంత్రి రాజణ్ణ విధానసౌధలోనే ఉన్నారు. శాసనసభలో కాసేపు గడిపి బయటకు వచ్చారు. ముఖ్యమంత్రి చాంబర్‌కు వెళ్తున్నానని, కొంతసేపటి తర్వాత మరిన్ని వివరాలు తెలుపుతానన్నారు. కానీ సీఎం లేకపోవడంతో ఆయన వ్యక్తిగత కార్యదర్శికి రాజీనామా లేఖను ఇచ్చారు.

కాంగ్రెస్ బుద్ధి బయట పడింది: విజయేంద్ర

మంత్రి రాజణ్ణను కేబినెట్‌నుంచి తొలగించడం వెనుక భారీ కుట్ర జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కుట్రలు పన్నిందని, కమిషన్‌ను దుర్వినియోగం చేసుకుని కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని రాహుల్‌గాంధీ ఆరోపించారన్నారు. ప్రత్యేకించి బెంగళూరు మహదేవపురలో ఓట్ల చౌర్యంపై రాహుల్ వ్యాఖ్యలకు అదే రోజున మేం తిప్పికొట్టామన్నారు. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని కళ్లు మూసుకున్నామా..? అంటూ మంత్రి రాజణ్ణ చేసిన వ్యాఖ్యలు ఆయనపై వేటుకు కారణమయ్యాయన్నారు.



టెక్ సమ్మిట్ సన్నాహక సభలో సీఎం, డీసీఎంతో వివిధ కంపెనీల ప్రముఖులు

టెక్ సమ్మిట్ విశ్వవ్యాప్త సందేశం కావాలి: సీఎం

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టెక్ సమ్మిట్ 2025 ప్రపంచానికే ఓ సందేశం ఇచ్చే వేదిక కావాలని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. నవంబరులో జరిగే టెక్ సమ్మిట్ సన్నాహకసభలో భాగంగా సోమవారం వివిధ కంపెనీల సీఈఓలతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ ఐటీ ఎగుమతులలో బెంగళూరుదే అగ్రస్థానమన్నారు. మేం పొరుగున ఉండే రాష్ట్రాలతో పోటీ పడడం లేదని, ప్రపంచదేశాలతోనే తలపడుతున్నామన్నారు. అందుకు బెంగళూరులోని ఐటీ, బీటీ, ఎంఎన్‌సీ, స్టార్టప్‌ల ప్రతినిధుల సహకారం కారణమన్నారు. టెక్ సమ్మిట్‌కు లక్షమంది పాల్గొంటారని మీరంతా రాయబారులు కావాలని, వివిధ కంపెనీల సీఈఓలను కోరారు. బెంగళూరు గురించి కంపెనీల ముఖ్యులకు అన్ని విషయాలు తెలుసుని, ప్రతిభ, ప్రగతి, వాతావరణం తెలిసినే అంశాలే అన్నారు. ఐటీ బీటీ పరిశోధనలు, వ్యాపార ఉద్దేశం కోసం 2లక్షల విదేశీ పాస్‌పోర్టులు ఉన్నాయన్నారు. 7వేలమంది విదేశీ విద్యార్థులు బెంగళూరులో చదువుతున్నారన్నారు. ప్రాథమిక విద్యకోసం సీఎస్ఆర్ నిధులను ఉపయోగించాలని, కంపెనీల ముఖ్యులను కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి బెంగళూరు అభివృద్ధికి సంబంధించి వివిధ ప్రాజెక్టులను వివరించానని, అందుకు ప్రధాని ఆసక్తిగా తిలకించారన్నారు. రూ.1.50 లక్షల కోట్లు అవసరమని కోరామన్నారు. ప్రధాని మోదీకి బెంగళూరు ప్రాజెక్టులు వివరించగా ప్రశంసలు కురిపించారన్నారు. సమావేశంలో ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే, కియోనెక్స్ ఛైర్మన్ శరత్‌బచ్చేగౌడ, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏక్‌రూప్‌కౌర్‌లు పాల్గొన్నారు.

రామచంద్రరావు పునర్నియామకం

● రన్యారావు కేసులో నాడు సెలవులోకి..

7లో

వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధన

● బృందావనాలకు అర్చనలు, అభిషేకాలు

తొక్కిసలాట ఘటనపై బీజేపీ నిరసన



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ ఎమ్మెల్యేలు

బెంగళూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్సీబీ సంబరాల వేళ 11మంది తొక్కిసలాటలో మృతి చెందారని, ఒత్తిడి తెచ్చినవారు ఎవరో కానీ పోలీసు అధికారులను బాధ్యులు చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. సోమవారం విధానసౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ తొక్కిసలాట సంఘటనలో సీఎం, డీసీఎం, హోం మంత్రితోపాటు పలువురు అమాయకులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్నారన్నారు. వీరి తప్పులను కప్పిపుచ్చేందుకు నిజాయితీ పోలీసు అధికారులకు శిక్ష పడేలా చేశారన్నారు. ఒక్కరోజులోనే విజయోత్సవాలు జరపలేమని, బందోబస్తు సాధ్యం కాదని పోలీసు అధికారులు సూచించినా పట్టించుకోకుండా అరకిలోమీటరు దూరంలో విధానసౌధ, చిన్నస్వామి స్టేడియంల వద్ద సంబరాలు జరిపారన్నారు. లక్షలాదిమంది అభిమానులు వస్తారని తెలిసినా ఎందుకు నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామితోపాటు శాసనసభ్యులంతా నిరసనలో పాల్గొన్నారు.



మరువ పారుతున్న దరోజీ చెరువు

ఉప్పొంగిన దరోజీ చెరువు

కంప్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సండూరు నియోజకవర్గంలోని దరోజీ చెరువు సోమవారం ఉప్పొంగి ప్రవహిస్తోంది. చెరువుపై భాగంలో గత రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండంతో చెరువులోకి భారీ నీరు చేరడంతో చెరువు నిండిపోయి క్రిందికి నాగళ్ల వాగు ఉప్పొంగి నీరు ప్రవహిస్తున్నాయి. ఈ వర్షాకాలంలో ప్రత్యేక చెరువు నిండిపోయి కిందికి నీరు ప్రవహించే సమయంలో ఆ నీటిని తిలకించడానికి జిల్లాలో నుండి వివిధ గ్రామాల్లో నుండి భారీ సంఖ్యలో ఇక్కడ చేరుకుని ఇక్కడ వుండే పరిసరాలను నీటిని తిలకిస్తారు. గతంలో ఎంపీ తుకారాం ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఇంతవరకు దరోజీ చెరువు ప్రాంతాలను అభివృద్ధికి ఆమడదూరంలో వుండిపోయాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా దరోజీ చెరువు కోడి వీరభద్రేశ్వర ఆలయం పరిధిలో పర్యాటకులకు ఆకట్టుకునే మాదిరిగానే అభివృద్ధి చేపట్టి ఆకట్టుకునేలా చేయాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

చిన్నారిపై హత్యాచారం కేసులో యావజ్జీవం

● తీర్పునిచ్చిన స్పెషల్ కోర్టు న్యాయాధికారి


నిందితుడు గంగాధర్ (ఫైల్)

హిందూపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): చిన్నారి అత్యాచారం, హత్య కేసులో నిందితుడు గంగాధర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. కేసు వివరాలు ఇలా... కర్ణాటక రాష్ట్రం నామగుండ్ల గ్రామానికి చెందిన మహిళ తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని హిందూపురం మండలం తూమకుంట గ్రామంలో ఉన్న తన సొంత అక్క ఇంటికి వచ్చారు. అయితే అక్క భర్త(బావ) గంగాధర్ ఆడుకుంటున్న ఎనిమిదేళ్ల చిన్నారిని గత ఏడాది ఆగస్టు 2న సమీప పొలాల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి, ఆపై హత్యచేసి పెన్నానది ఒడ్డున పూడ్చేశాడు. ఎంతసేపటికీ చిన్నారి కనిపించకపోవడంతో తల్లి ఆందోళనతో వెదికింది. దీంతో చుట్టు పక్కల ఉన్న వారు చిన్నారిని గంగాధర్ తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో ఆమె గట్టిగా నిలదీశారు. చుట్టుపక్కలవారు సైతం గంగాధర్‌ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. దీంతో చంపేసి పూడ్చినట్లు ఒప్పుకున్నాడు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకోవడంతో కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో 17మంది సాక్షులను విచారించగా నేరం రుజువైంది. దీంతో అనంతపురం పోక్సో కేసుల స్పెషల్ కోర్టు న్యాయాధికారి చిన్నబాబు సోమవారం గంగాధర్‌కు యావజ్జీవ కారాగారశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే సాక్ష్యాన్ని తారుమారు చేసేందుకు చిన్నారి శవాన్ని పూడ్చడంపై ఐదేళ్ల జైలుశిక్ష, మరో రూ.10వేలు జరిమానా విధించారు. ఈ కేసు పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, నిందితుడికి శిక్షపడేలా చేసిన డీఎస్పీలు కంజక్షన్, మహేష్, సీఐలు ఆంజనేయులు, శ్రీనివాసులును జిల్లా ఎస్పీ అభినందించారు.

డ్రైనేజీలో పడి చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవి థియేటర్ వద్ద డ్రైనేజీ కాలువలో పడి చేనేత కార్మికుడు సుపారి నాగరాజు (60) సోమవారం మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని బసవన్నకట్ట వీధికి చెందిన సుపారి నాగరాజు పట్టుచీరలు మడతలు వేస్తూ జీవించేవాడు. తరచూ మద్యం తాగేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం తాగి, శ్రీదేవి థియేటర్ సమీపంలోని గ్రంథాలయం ఎదురుగా డ్రైనేజీ పక్కన పడిపోయాడు. రాత్రి వర్షం రావడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటి ప్రవాహానికి డ్రైనేజీలోకి పడిపోయి, చనిపోయాడు. సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికులు.. డ్రైనేజీని శుభ్రం చేస్తుండగా నాగరాజు మృతదేహం బయటపడింది. స్థానికులు గుర్తించి, అతడి కుమారుడు మనోహర్‌కు సమాచారం అందించారు. మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. నాగరాజు భార్య గతంలోనే మరణించింది.

పిచ్చికుక్క స్వైరవిహారం.. ఐదుగురిపై దాడి

ఉరవకొండ, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పిచ్చికుక్క సోమవారం స్వైరవిహారం చేసింది. పాత స్టేట్ బ్యాంకు, జైనబ్బీ దర్గా, కవిత హోటల్, టవర్ క్లాక్ కూడలిలో పలువురిపై దాడిచేసింది. వివిధ పనుల నిమిత్తం ఉరవకొండకు వచ్చిన చిన్నముష్టూరు, పొట్టిపాడు, చిన్నహోతూరు గ్రామాలకు చెందిన వారిని గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో రాము, ఓబులేశు, నారాయణ, రామాంజనేయులు మరో వ్యక్తి గాయపడ్డారు. వారిని ప్రథమ చికిత్స కోసం ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు.

రూ.36 లక్షల ఎయిర్ ఫైబర్ రూటర్ చోరీ


ఎయిర్‌ఫైబర్ రూటర్ గది

గాండ్లపెంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో రూ.36లక్షల విలువ చేసే ఎయిర్ ఫైబర్ రూటర్ సామగ్రి శనివారం చోరీ అయినట్లు సిబ్బంది సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ ఎయిర్‌ఫైబర్ సిబ్బంది రాజు తెలిపిన మేరకు.. సబ్‌స్టేషన్‌లో రూ.36లక్షల విలువ చేసే రూటర్ సామగ్రిని అమర్చారన్నారు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు ఎయిర్‌ఫైబర్ సిబ్బంది అంటూ గదిలోకి ప్రవేశించి, అందులోని రూటర్‌ను తీసుకెళ్లారన్నారు. అక్కడున్న సిబ్బంది ప్రశ్నించగా, తాము ఎయిర్‌ఫైబర్ సిబ్బంది అంటూ సమాధానమిచ్చినట్లు తెలిపారు. రూటర్‌ను కారులో తీసుకెళ్లినట్లు వివరించారు. తాము ఆదివారం గమనించడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఈవిషయంపై ట్రైనీ ఎస్ఐ రవికుమార్‌ను వివరణ కోరగా, తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. ఎయిర్ ఫైబర్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

● వ్యక్తిపై కేసు నమోదు

ధర్మవరం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుతం పట్టణంలో ఉంటున్న మహిళ, ఆమె భర్త ఏడాది క్రితం బత్తలపల్లిలో ఉండేవారు. అక్కడ అక్కడ కిరాణా షాపు నిర్వహిస్తుండేవారు. ఆ సమయంలో బత్తలపల్లికే చెందిన బోయ గోపాల్ అప్పుడప్పుడు దుకాణానికి వస్తుండేవాడు. ఆ పరిచయంతో సదరు మహిళ ఫోన్ నంబరు తీసుకుని, చనువుగా మాట్లాడేవాడు. ఆ తరువాత ఆమె మాట్లాడిన మాటలను రికార్డు చేశాడు. వాటిని వినిపిస్తూ తనకు డబ్బు ఇవ్వాలనీ, లేకపోతే కోరిక తీర్చాలని ఆమెను గోపాల్ వేధించేవాడు. 'లేదంటే నీ భర్తకు చూపిస్తానం'టూ బెదిరించేవాడు. విషయాన్ని సదరు మహిళ.. భర్తకు చెప్పింది. దీంతో బత్తలపల్లి నుంచి ధర్మవరానికి వచ్చేశారు. అయినా గోపాల్... వేధింపులు ఆగలేదు. ఈనెల 7వ తేదీన రాత్రి చందన ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం తెలుసుకున్న గోపాల్ అర్ధరాత్రి దాటాక తలుపులు గట్టిగా కొట్టసాగాడు. ఎవరో అని సదరు మహిళ తలుపులు తీసింది. గోపాల్ తనతో వస్తావా.. లేదా.. అంటూ నానా దూర్భాషలాడుతుండటంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు రావడంతో గోపాల్ పరారయ్యాడు. ఈ మేరకు బాధిత మహిళ సోమవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డెప్ప తెలిపారు.

సెక్టోరల్స్‌కు ఇంటర్వ్యూలు ప్రారంభం


సెక్టోరల్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం విద్య, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష శాఖ సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆరు పోస్టులకు 47మంది టీచర్లు అర్హుల జాబితాలోకి వచ్చారు. వీరందరికీ ఇంటర్వ్యూలు ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సెంటర్‌లో సోమవారం ఇంటర్వ్యూలు మొదలు పెట్టారు. అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహార్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ, డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలిరోజు 25మందిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించగా, 22మంది హాజరైనట్లు ఏపీసీ శైలజ తెలిపారు. మిగిలిన 22 మంది టీచర్లకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఏపీసీ తెలిపారు.

బడిలో భయం..!

● శిథిలావస్థలో తరగతి గదులు
● పరిగిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో భద్రత గాలికి..
● కూలే స్థితిలో గోడలు.. స్కూల్ చుట్టూ ఇటుక బట్టీలు
● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
● పెచ్చులూడిపడిన కె.రాంపురం అంగన్‌వాడీ సెంటర్ పైకప్పు

కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పాత భవనాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే చిన్నారులు రోజు వెళ్లే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పరిస్థితులపై ఆందోళన నెలకొంది. వాటి యాజమాన్యాలు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని, టీచర్లు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇందుకు కొన్ని ప్రైవేట్ పాఠశాలలు కూడా మినహాయింపు కాదు. ఉన్నతాధికారుల ఉదాశీన వైఖరిలో పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


వర్షానికి నెమ్మెక్కిన పాఠశాల వెనుక గోడలు


పాఠశాలకు ఆనుకుని ఉన్న ఇటుక బట్టీలు

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీరంగరాజులపల్లి రహదారిలో ఎనిమిదేళ్ల కిందట వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తి తాత్కాలికంగా భవన అనుమతులు పొంది బెల్లా పాఠశాలను ఏర్పాటు చేశాడు. ఇంగ్లిష్ మీడియం పేరుతో ఫీజులు బాగానే వసూలు చేస్తూ పిల్లల భద్రతను మాత్రం మరిచిపోయాడు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల గదులకు చెమ్మ వచ్చి, కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. వర్షం వస్తే కిటికీల నుంచి తరగతి గదుల్లోకి నీరు వస్తోంది. పునాదులు లేకుండా గోడలు నిర్మించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అలాగే పాఠశాల చుట్టూ ఇటుకల బట్టీలు ఉండటంతో దాని నుంచి వచ్చే పొగ పీల్చి విద్యార్థులు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. దాదాపు 300మందికిపైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, విద్యార్థులను ప్రమాదం నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

● ఈ విషయంపై కరస్పాండెంట్ వర్గీస్‌ను ఫోన్‌లో వివరణ కోరగా తాను పాఠశాలలో లేనని సొంతపనిపై కేరళ వచ్చానని బదులిచ్చారు. ఇటుక బట్టీల మధ్యలో గదులు ఎందుకు నిర్మించారని ప్రశ్నించగా తానిప్పుడు సమాధానం ఇవ్వలేనని ఇతర పనుల్లో ఉన్నానని కాల్ కట్ చేశారు.

చర్యలు తీసుకుంటాం: లక్ష్మీదేవి, ఎంఈఓ



పునాదులు లేకుండా తరగతి గదులను నిర్మిస్తే, దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి రాబోయే కాలంలో గుర్తింపు రద్దు చేస్తాం. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల గదులు దృఢంగా నిర్మించాలి. ఇంగ్లిష్ మీడియం పేరుతో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అధిక ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.


పెచ్చులూడిన పై కప్పు నుంచి కనిపిస్తున్న ఇనుప కడ్డీలు

వానొస్తే పెచ్చులూడుతున్నాయ్..!

కళ్యాణదుర్గం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలంలోని కే.రాంపురం అంగన్‌వాడీ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. చిన్న వర్షం వచ్చినా పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. ఆ అంగన్‌వాడీ సెంటర్ భవనం పైకప్పు పెచ్చులు సోమవారం కూడా ఊడిపడటంతో సిబ్బంది, పిల్లలు తీవ్ర ఆందోళన చెందారు. పైకప్పు పెచ్చులూడిపోయి, అందులో ఉన్న ఇనుప కడ్డీలన్నీ బయటకు కనిపిస్తున్నాయి. దీంతో వర్షపు నీరంతా లీకేజీ అవుతూ, గది మొత్తం తడిసిపోయింది. 35 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం అంతా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ అంగన్‌వాడీ కేంద్రానికి 20 మంది దాకా పిల్లలు వస్తున్నారు. భవనం పెచ్చులూడిపడుతుండటంతో వారందరినీ ఆరు బయటే కూర్చోబెడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో, అంగన్‌వాడీ సెంటర్‌కు పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆరుబయటే కూర్చున్న పిల్లలు

నాకు నమ్మకం లేదు దొరా..!

● నా భార్య చనిపోతేనే పట్టించుకోలేదు
● సాక్ష్యాలను ఇస్తే మాయం చేశారు
● నాపైనే కేసు పెడతామని బెదిరించారు
● పోలీసు బాధితుడు.. ప్రవీణ్ ఆవేదన
● బుక్కరాయసముద్రంలో దగ్ధమైన బేకరీ


కాలిపోతున్న బేకరీ


సితార (ఫైల్)


సూసైడ్ నోట్

బుక్కరాయసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నార్పల క్రాస్ వద్ద అయ్యంగార్ బెంగళూరు బేకరీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఉత్తర కర్ణాటకకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి ఏడాది క్రితం బుక్కరాయసముద్రంలో ఈ బేకరీని ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం వేకువజామున ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగడంతో బేకరీలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. గమనించిన స్థానికులు.. పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసింది. బేకరీలోని రెండు గ్యాస్ సిలిండర్లు ఒకదాని తరువాత ఒకటి పేలాయి. దీంతో మంటలను ఆర్పడం కష్టంగా మారింది. అనంతపురం-తాడిపత్రి ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో అటు వైపు వెళ్లే వాహనాలను పోలీసులు ఆపేశారు. ట్రాఫిక్‌ను మళ్లించారు. చుట్టుపక్కల ఉన్న వారిని అప్రమత్తం చేశారు. గ్యాస్ సిలిండర్లు పేలిన అనంతరం మంటలను అగ్నిమాపక సిబ్బంది ఆర్పి వేశారు. అప్పటికే దుకాణంలో ఉన్న యంత్రాలు, ఫ్రిజ్‌లు, ఫర్నిచర్, నగదు, మెటీరియల్ తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు ప్రవీణ్ తెలిపాడు. జరిగిన ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేయబోనని బాధితుడు అన్నారు. తనకు వారు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదని కుండబద్ధలు కొన్నారు. ఓ వ్యక్తి వేధింపుల కారణంగా తన భార్య ఆత్మహత్య చేసుకుందని, ఈ విషయంలో పోలీసులు తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

అందుకే.. నమ్మకం లేదు..

ఉత్తర కర్ణాటకకు చెందిన ప్రవీణ్, సితార దంపతులు అనంతపురానికి వలస వచ్చారు. కక్కలపల్లి సమీపంలోని టమోటా మార్కెట్ వద్ద బేకరీ ఏర్పాటు చేసుకున్నారు. అక్కడే ఉన్న ఓ టమోటా వ్యాపారి తరచూ బేకరీ వద్దకు వస్తుండేవాడు. అలా సితారతో పరిచయడం పెంచుకున్నాడు. కొన్నిసార్లు స్నేహపూర్వకంగా ఫోన్‌లో మాట్లాడాడు. వాట్సాప్ చాటింగ్ కూడా చేశాడు. ఇదే అదునుగా సితారను లైంగికంగా వేధించడం మొదలెట్టాడు. వాటిని భరించలేక సితార ఈ ఏడాది మార్చి 14వ తేదీ రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. టమోటా వ్యాపారి వేధింపులు భరించలేకే తన భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ప్రవీణ్ ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. 'అన్ని ఆధారాలు అప్పట్లో ఇచ్చినా. ఇప్పుడు ఏమీ లేవని అంటున్నారు. టమోటా వ్యాపారి వేధింపులు భరించలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సితార సూసైడ్ నోట్‌లో రాసింది. అతని పేరు కూడా రాసింది..' అని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అతన్ని స్టేషన్‌కు పిలిపించి తూతూమంత్రంగా విచారించి వదిలేశారని సమాచారం. వివాహేతర సంబంధం నేపథ్యంలో సితారను భర్త ప్రవీణ్, కుటుంబ సభ్యులు మందలించడంతోనే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేశారు.

సెటిల్‌మెంట్ కోసం బెదిరింపులు

భార్య చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న తనను గతంలో పనిచేసిన పోలీసు అధికారి 'సెటిల్ చేసుకో.. లేకపోతే నువ్వేకొట్టావని కేసు నమోదు చేస్తా' అని బెదిరించాడని ప్రవీణ్ కన్నీటి పర్యంతమయ్యారు. సూసైడ్ లెటర్‌ను పరీక్షలకు పంపాల్సిన బాధ్యత మరచిన పోలీసులు, 'నీ భార్యే రాసిందని ఏమి ప్రూఫ్' అని ఎదురు ప్రశ్న వేశారట. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని అడిగినా పోలీసులు పట్టించుకోలేదని వాపోయాడు.

విచారణ చేయిస్తాం..

సితార ఆత్మహత్య విచారణ విషయం మా దృష్టికి రాలేదు. వేధింపులకు పాల్పడినట్లు రుజువైతే తప్పనసరిగా చర్యలు తీసుకుంటాం. ఇలా జరిగిందని ఏ రోజూ బాధితులు ఫిర్యాదు చేయలేదు.

- వెంకటేశులు, డీఎస్పీ

రుజువు కాలేదు..

సితార మృతి కేసులో టమోటా వ్యాపారిని పిలిపించి విచారించాం. పరిచయం మాత్రమే ఉన్నట్లు తెలిసింది. సెల్ సంభాషణ, బేకరీ వద్ద మాట్లాడినట్లు సాక్ష్యాలు ఉన్నాయి. వేధించినట్లు రుజువు కాలేదు. సూసైడ్ నోట్‌కు సంబంధించి ఆధారాలు తీసుకొస్తే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతాం. ఆమె రాసినదేనని తేలితే టమోటా వ్యాపారిపై చర్యలు తప్పవు.

- పుల్లన్న, సీఐ

ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం

● ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఎమ్మెల్యే


గ్యారేజీలో కార్మికులతో మాట్లాడుతున్న జోనల్ చైర్మన్, ఎమ్మెల్యే

కదిరి, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం చేసినట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను వారు సోమవారం పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులు, ప్రయాణికులతో మాట్లాడారు. కదిరి బస్టాండ్ నుంచి డిపో వరకు రూ.20లక్షలతో రోడ్డు నిర్మిస్తామన్నారు. రూ.8కోట్లతో కదిరి ఆర్టీసీ బస్టాండ్‌లో 16 టెర్మినల్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆధునాతమైన మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. మరో రెండు నీటిశుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సులు నడుపుతామన్నారు. వారి వెంట డీఎం మైనుద్దీన్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించండి

● కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు


కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో హోం శాఖ మంత్రిని కలిసిన ఉమ్మడి జిల్లా టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రతినిధుల బృందం

అనంతపురం/పుట్టపర్తి ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ విషయంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కోరారు. కేంద్ర మంత్రి అమిత్‌షాను పార్లమెంట్ భవన్‌లోని ఆయన కార్యాలయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సోమవారం కలిశారు. ఆర్డీటీ సేవలకు సహకరించాలని కోరడంతోపాటు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు. అత్యంత వెనుకబడిన, దుర్భిక్ష ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంగా ఐదున్నర దశాబ్దాలుగా ఆర్డీటీ ప్రజలకు అనేక రూపాల్లో అందిస్తున్న సేవలను వారు హోం మంత్రికి వివరించారు. 2021 నుంచి ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణలో కలుగుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విదేశీ విరాళాల విషయంలో ఆంక్షల వల్ల సంస్థ కొనసాగిస్తున్న కార్యకలాపాలకు అవరోధం ఏర్పడిందని తెలిపారు. కేంద్ర హోం శాఖ సూచన మేరకు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణకు ఆర్డీటీ మూడు నెలల కిందట దరఖాస్తు సమర్పించిందన్నారు. ఆ దరఖాస్తును పరిశీలించి, సానుకూలమైన నిర్ణయం తీసుకోవాలని వారు అమిత్‌షాను కోరారు. అనంతపురం జిల్లాతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అత్యంత మారుమూల ప్రాంతాల్లో ఆర్డీటీ విశేష సేవలు అందిస్తోందని వారు హోం మంత్రికి వివరించారు. అలాంటి సంస్థ కార్యకలాపాలు మరింత విస్తృతం చేయడం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు బృందం విజ్ఞప్తికి హోం మంత్రి సానుకూలంగా స్పందించడంతోపాటు ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ విషయంలో వారం రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసినందుకుగాను హోంమంత్రిని, కేంద్ర ప్రభుత్వాన్ని టీడీపీ ప్రతినిధుల బృందం అభినందించింది.

మాతాశిశు మరణాలు జరగకూడదు

● ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బిడ్డకు జన్మనిస్తూ ఏ తల్లీ చనిపోకూడదని, ఏ శిశువూ జన్మించే సమయంలో మృతి చెందకూడదని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్‌తో సోమవారం సమీక్ష నిర్వహించారు. కూడేరు, నాగసముద్రం, విడపనకల్లు, అంబేడ్కర్ నగర్ పీహెచ్‌సీలలో జరిగిన తల్లి మరణాల గురించి సమీక్షించారు. జిల్లాలో తల్లి మృతి చెందినప్పుడు, మరణానికి ముందు ఏ రకమైన ఇబ్బందులు ఎదురయ్యాయి, అందుకు కారణాలు తెలుసుకోవాలని ఆదేశించారు. మరోసారి ఇలాంటి కారణంతో మరణం జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరణాలను నివారించడానికి వైద్యశాఖలో ఉన్న సూపర్‌వైజర్, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇకపై మాతృ మరణాలు జరిగినచోట తానే స్వయంగా వచ్చి విచారిస్తానని అన్నారు. ప్రతి గర్భిణికి 12 వారాల్లోపు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించి, వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రమాదకర లక్షణాలున్న స్త్రీల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, సుఖప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. రక్తహీనత, గుండె సంబంధిత సమస్యలు, తక్కువ ఎత్తు, గర్భంలో ఉమ్మనీరు తక్కువ, బిడ్డ పెరుగుదల లేకపోవడం వంటి సమస్యలున్న హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించాలని సూచించారు. శిశు మరణాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్

టమోటా కిలో రూ.46

అనంతపురం రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో సోమవారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ. 27, సరాసరి ధర రూ. 34 పలికాయన్నారు. మార్కెట్‌కు 3,375 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

పరిగి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని ఎన్. ముద్దిరెడ్డిపల్లికి చెందిన సీకే గంగాధరప్ప (44) సోమవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంగాధరప్ప రైతు. మద్యానికి బానిసయ్యాడు. వారం రోజులుగా విపరీతంగా మద్యం తాగాడు. మద్యం సేవించడానికి కుటుంబ సభ్యులు డబ్బు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది గ్రామ సమీపంలోని పొలంలో చెట్టుకు ఉరేసుకుని, మరణించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

విక్రమ్ సారాభాయ్ (జయంతి)



భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు ఆద్యుడైన విక్రమ్ సారాభాయ్ 1919 ఆగస్టు 12న గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జన్మించారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సర్ సీవీ రామన్ పర్యవేక్షణలో కాస్మిక్ కిరణాలపై పరిశోధనలు చేశారు. ఐఐటీ ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీని (పీఆర్ఎల్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) స్థాపించి ఎన్నో పరిశోధనలు చేశారు. దేశ భవిష్యత్తుకు శాటిలైట్‌ల అవసరాలను గుర్తించి అప్పటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూకు వివరించి ఒప్పించారు. అణుశక్తి వ్యవస్థ పితామహుడైన హోమీ బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ ఏర్పాటు చేసి పలు విజయాలు అందు కున్నారు. 1971 డిసెంబరు 30న కన్నుమూశారు. 1972లో మరణానంతరం 'పద్మవిభూషణ్' ప్రకటించారు.

హెలెనా బ్లావెట్‌స్కీ (జయంతి)



మేడ్ హెలెనా బ్లావెట్‌స్కీ 1831 ఆగస్టు 12న రష్యా దేశంలో జన్మించారు. థియోసాఫికల్ సొసైటీ (దివ్యజ్ఞాన సమాజం) సహ సంస్థాపకులలో ఒకరు. రచయిత, ఆధ్యాత్మికత భావాలు కల్గిన ఆమె ఆసియా, యూరప్, అమెరికా ఖండాలతోపాటు ఇండియాలోనూ, టిబెట్‌లోనూ పర్యటించారు. ఆర్య సమాజ్‌కు అనుగుణంగా సొసైటీ పనిచేసేది. ఆమె మూడు పుస్తకాలను ప్రచురించారు. ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు కృషి చేశారు. 1891 మే 8న కన్నుమూశారు. ఆమె వర్ధంతిని వైట్ లోటస్ డేగా ఆచరిస్తారు.

సీతారాం ఏచూరి (జయంతి)



సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న మద్రాస్‌లో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) ప్రధాన కార్యదర్శి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. విద్యార్థిగా స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో కీలకంగా ఉండి అనంతరం సీపీఎంలో చేరారు. రాజకీయాల్లో కొనసాగుతూనే ప్రముఖ ఆంగ్ల దినపత్రిక హిందూస్తాన్ టైమ్స్‌లో కాలమ్స్ రాస్తుంటారు. రాజకీయ నాయకుడిగానే కాక ఆర్థికవేత్తగా, రచయితగా, కాలమిస్ట్‌గా గుర్తింపు పొందారు. 2024 సెప్టెంబరు 12న కన్నుమూశారు.

శాంతా ధనుంజయన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత వన్నదిల్ పుదియవీట్టిల్ ధనుంజయన్ భార్య శాంతా ధనుంజయన్ 1943 ఆగస్టు 12న జన్మించారు. నృత్య దంపతులైన వీరు ధనుంజయన్స్‌గా పేరొందారు. 2009లో 'పద్మభూషణ్' అందుకున్నారు. భరతనాట్యంపాటు కథాకళి, కర్ణాటక సంగీతంలోనూ రాణించారు. నృత్య చూడామణి, కళైమామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 1968లో చెన్నైలో భారత కళాంజలి ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసి ఎంతోమందికి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చారు.

సిద్దరామయ్య (పుట్టినరోజు)



కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య 1948 ఆగస్టు 12న మైసూరు జిల్లాలో జన్మించారు. ప్రస్తుతం వరుణ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతకు ముందు బాదామి నియోజకవర్గం ఎమ్మెల్యేగా కొనసాగారు. 2013-18ల మధ్య ఐదేళ్లపాటు పూర్తిస్థాయి పాలన అందించిన రెండో సీఎంగా గుర్తింపు పొందారు. చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా కొనసాగారు. గతంలో జనతాదళ్, జేడీఎస్ పార్టీలలో కీలకంగా వ్యవహరించారు. 'అహింద' పోరాట నేతగా ఎదిగారు.

పీట్ సంప్రాస్ (పుట్టినరోజు)



ప్రముఖ టెన్నిస్ క్రీడాకారులలో ఒకరైన పీట్ సంప్రాస్ 1971 ఆగస్టు 12న వాషింగ్టన్ డీసీలో జన్మించారు. టెన్నిస్ క్రీడలో ఉత్తమ క్రీడాకారుడిగా నిలిచారు. 7 వింబుల్డన్ పోటీల్లోను గెలిచారు. 14 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించారు. 1993 నుంచి 1998 వరకు వరుసగా ఆరేళ్లపాటు నెంబరు వన్ స్థానం కొనసాగారు. 7 వింబుల్డన్ టైటిల్స్, 2 ఆస్ట్రేలియన్ ఓపెన్స్, 5 యూఎస్ ఓపెన్‌టైటిల్స్ సాధించారు. స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ది ఇయర్ తదితర అవార్డులు అందుకున్నారు. 1965 నుంచి 2005 వరకు 40 గొప్ప టెన్నిస్ క్రీడాకారులలో ఒకరిగా నిలిచారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి మధ్యారాధన

చింతామణి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనా మహోత్సవంలో భాగంగా రెండోరోజు సోమవారం మధ్యారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం అష్టోత్తర ఫలపంచామృత అభిషేకం, సర్వపా ప్రాయశ్చిత్తకర పవమానహోమం, పూర్ణాహుతి, కనకాభిషేకం నిర్వహించారు. అనంతరం విద్వాంసులచే ప్రవచనం జరిగింది. రాఘవేంద్ర భజనామండలి ఆధ్వర్యంలో భజన, మహామంగళారతి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్వరసాధనరత్న, గానకళారత్న పురస్కార విజేత విద్వాన్ విశ్వేశ్వరభట్, విద్వాన్ మీనామూర్తి, బెంగళూరు బృందంచే పంచవీణా కార్యక్రమం జరిగింది.

నేడు ఉత్తరారాధన

ఉత్తరారాధనలో భాగంగా మంగళ వారం ఉదయం సహస్రశంఖ క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, లక్ష్మీహృదయ హోమం, 9.30 గంటలకు పూర్ణాహుతి, అనంతరం ఎన్ఆర్ లే అవుట్ పురవీధులలో భజనామండలిచే భజనోత్సవం, నృత్యోత్సవం, కోలాటాలతో రథోత్సవం కొనసాగనుంది. అనంతరం మహా మంగళారతి, తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. సాయంత్రం 6.30గంటలకు విద్వాన్ వికాస్ వశిష్ఠ బృందంచే దాసరపదాల గాయనం ఉంటుంది.

ముళబాగిలులో..



ముళబాగిలులో క్షీరాభిషేకం



చింతామణిలో పంచామృతాభిషేకం

ముళబాగిలు: పట్టణంలోని అగ్రహారలో కొలువైన ప్రసన్న రాఘవేంద్రస్వామి మఠంలో 354వ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా విశేషపూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. సోమవారం మధ్యారాధనలో భాగంగా రాఘవేంద్రస్వామి రథోత్సవాన్ని పాదరాజమఠం మఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామిజీ ప్రారంభించారు. పురవీధులలో రథం ఊరేగగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, మహామంగళారతి నిర్వహించారు. సర్వమూల, సుమధ్వ విజయ పారాయణ, పండితులచే ఉపన్యాసం, అలంకరణ, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదానం నిర్వహించారు. రంగవితల ప్రియ, గోపినాథప్రియ, ఛాయసంజ్ఞ, శ్రీవాసవి, శ్రీవారి సమృద్ధి, శ్రీనాదప్రియ భజనామండలి ఆధ్వర్యంలో గోష్ఠిగాయనంలోనూ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పురవీధులలో రథోత్సవం



భజనలో పాల్గొన్న భక్తబృందం

గెలుపుతో బాధ్యత పెరుగుతుంది: బీఈఓ

బాగేపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): గెలుపు వల్ల బాధ్యత పెరుగుతుందని, ఓటమి వల్ల గతంలోని తప్పులను సరిదిద్దుకునేందుకు మార్గ దర్శనం చేస్తుందని, పిల్లలు స్నేహపూర్వకంగా క్రీడలలో పాల్గొనాలని తాలూకా బీఈఓ ఎన్ వెంకటేశప్ప సూచించారు. గూళూరు హోబళి మానవధర్మ పీఠం జచని హైస్కూల్ ఆవరణలో సోమవారం పాఠశాల విద్యాశాఖ, సాక్షరతాశాఖ, బీఈఓ కార్యాలయం, డాక్టర్ జచని హైస్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో హోబళి స్థాయి 2025-26 వార్షిక క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బీఈఓ మాట్లాడుతూ.. క్రీడలను క్రీడలుగా స్వీకరించాలని, న్యాయనిర్ణేతలు ఇచ్చే తీర్పు గౌరవించాలని హితవు పలికారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రంగనాథ్ మాట్లాడుతూ.. ఓడిపోయినవారిని కూడా అభినందించాలన్నారు. గెలిచినవారు ఓడినవారి పట్ల చులకనగా చూడరాదని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ 35ఏళ్ల చరిత్రలో తొలిసారిగా హోబళిస్థాయి క్రీడా పోటీలు డాక్టర్ జచని స్కూల్‌లో నిర్వహిం చడం అభినందనీయమన్నారు. పోటీలకు సహకరించిన ఉపాధ్యాయులు, ఇతరులకు ధన్యవాదాలన్నారు. పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఏజీ సుధాకర్, విద్యాశాఖ సమన్వయాధికారి వెంకటరామ్, గూళూరు ఈసీఓ రవికుమార్, ఉపాధ్యాయులు ఎన్ శివప్ప, బాలరాజు, వెంకటేశ్, సుబ్రమణి, నాగరాజు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాపోటీల ప్రారంభంలో బీఈఓ వెంకటేశప్ప తదితరులు

భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి

శిడ్లఘట్ట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): భూసారాన్ని తెలుసుకునే మట్టి పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని జీకేవీకే వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు సూచించారు. తాలూకాలోని కొత్తనూరు గ్రామంలో మూడు నెలలపాటు బస చేసే వ్యవసాయ విద్యార్థులు అవగాహన కల్పించారు. మట్టి పరీక్ష ద్వారా మట్టి ఆరోగ్యాన్ని తెలుసుకోవచ్చునని, అవసరమైన మేరకు రసాయన ఎరువులు వాడవచ్చునని తద్వారా రైతులకు కూడా లాభదాయకమన్నారు. విద్యార్థులు గగన్, చన్నయ్య, ఇమామ్, అనూష తదితరులు ప్రత్యక్షంగా వివరించారు. గ్రామపెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

విద్యతోపాటు సాంకేతికతను అలవరచుకోవాలి



తరగతుల ప్రారంభోత్సవంలో సుదీప్ దళవి తదితరులు

దొమ్మసంద్ర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అలవరుచుకోవాలని టయోటా కిర్లోస్కర్ మోటార్స్ సంస్థ సీనియర్ ఉపాధ్యక్షుడు సుదీప్ దళవి అభిప్రాయపడ్డారు. ఆనేకల్ తాలూకా ఎలక్ట్రానిక్‌సిటీ ఐఎస్‌బీఆర్ కళాశాలలో ఎంబీఏ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. యువత పట్టుదలతో నిరంతర అధ్యయనం ద్వారా ఉన్నతవిద్యలో రాణించాలన్నారు. పీజీ విద్యలో సుస్థిర అభివృద్ధి, నాయకత్వ గుణాలను పెంచుకోవాలన్నారు. ఎంబీఏ పూర్తయ్యాక ఉద్యోగం కోసం వెదుకులాట చేయక ఉద్యోగాన్ని సృష్టించేలా ఎదగాలన్నారు. పీపుల్ లీడర్ సంస్థ కమల్ అర్థవాని, ఐఎస్‌బీఆర్ గ్రూప్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ మనీశ్ కొఠారి, ఫిలిప్స్ సంస్థ డేటా సైంటిస్ట్ ఆకాశ్, పాలకమండలి డైరెక్టర్ ఆనంద్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

పెరంబూర్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ విషయమై వాతావరణ కేంద్రం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ఉత్తరాంధ్ర, పరిసర ప్రాంతాల్లో వాతావరణ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, 13న వాయువ్య, దానిని అనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని తెలిపింది. ఉపరితల ఆవర్తనం కారణంగా రానున్న 48 గంటల్లో ఉత్తర, దక్షిణ తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. అదే సమయంలో, తిరువళ్లూర్, రాణిపేట, వేలూరు, తిరుపత్తూర్, నీలగిరి జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాముందని, రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. నైరుతి, ఉత్తర బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలు, అండమాన్ తీరం, పశ్చిమ-మధ్య అరేబియా సముద్రంలోని పలు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో పెనుగాలులు వీచే అవకాశముందని, అందువల్ల మంగళవారం నుంచి ఈనెల 15వ తేది వరకు జాలర్లు ఆ ప్రాంతాలకు వెళ్లరాదని వాతావరణ కేంద్రం సూచించింది.



'అమృత్ భారత్' కింద నాలుగు రైల్వేస్టేషన్ల అభివృద్ధి

ప్యారీస్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 'అమృత్ భారత్' పథకం కింద తిరువళ్లూర్ జిల్లాలోని తిరుత్తణి, తిరువళ్లూర్, గుమ్మిడిపూండి, అరక్కోణం రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ తెలిపారు. ఆయన చెన్నై డీఆర్ఎం శైలేంద్ర సింగ్‌తో కలసి సబర్బన్ విద్యుత్ రైళ్ల నడిపే మార్గాలను సోమవారం పరిశీలించారు. ఈ మార్గాల్లో భద్రతాంశాలు, సిబ్బంది, స్టేషన్ మాస్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎన్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ... దక్షిణ రైల్వే పరిధిలో ఉన్న సెయింట్ థామస్ మౌంట్, సూళ్లూరుపేట సహా 13 రైల్వేస్టేషన్లు రూ.129.66 కోట్లతో విస్తరించి, గతనెల నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు అమృత్ భారత్ పథకం కింద తిరువళ్లూర్ జిల్లాలోని నాలుగు రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు 92 శాతం పూర్తయ్యాయని, వచ్చే జనవరి నాటికి ఇవి అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నాలుగు రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల విశ్రాంతి గది, ఎస్కలేటర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రైళ్ల రాకపోకలు తెలిపేలా డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్ఎన్ సింగ్ తెలిపారు.

పంద్రాగస్టుకు పటిష్ట బందోబస్తు

● విమానాశ్రయాల్లో ఐదంచెల భద్రత

పెరంబూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.. ఇప్పటికే రాష్ట్రంలో వున్న అన్ని విమానాశ్రయాలకు ఐదెంచెల భద్రత ఏర్పాటు కాగా, సమస్యాత్మక ప్రాంతాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో తీవ్ర అవమానపాలైన పాకిస్తాన్ ప్రేరేపిత మూకలు అవాంఛనీయ ఘటనలకు పాల్పడవచ్చనే అనుమానంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, జనావాస ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్ అన్నింటిపైనా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అదే విధంగా ఆలయాలు, మసీదులు, చర్చిల వద్ద కూడా పోలీసులు నిఘా వేసివుంచారు. అనుమానితుల్ని ఎక్కడికక్కడ ప్రశ్నిస్తున్న పోలీసులు.. ఏమాత్రం సందేహమొచ్చినా, వారిని అదుపులోకి తీసుకుంటున్నారు., విమానాశ్రయాల వద్ద సాధారణం కంటే గస్తీ మరింత పెంచారు. లగేజీ క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు డొమెస్టిక్ ప్రయాణీకులు గంటన్నర ముందుగా విమానాశ్రయాలకు చేరుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. విదేశీ ప్రయాణీకులైతే మూడున్నర గంటల ముందుగా వుండాలని సూచించారు. దీనికి తోడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడం, ఇటీవల కాలంలో శాంతిభద్రతలు కాస్త ఇబ్బందికరంగా మారడం వంటి పరిణామాల్లో రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ వ్యవహారాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా స్వాతంత్ర్యదినోత్సవం జరగాలని, ఇబ్బందికరమైన ఘటనల ద్వారా ప్రతిపక్షాల విమర్శలకు తావివ్వరాదని ప్రభుత్వం ఇప్పటికే పోలీసులను ఆదేశించింది. ఆ మేరకు పోలీసు శాఖ కూడా పటిష్ఠమైన చర్యలు చేపడుతోంది.



విమానాశ్రయం వద్ద సాయుధ బలగాలు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.1.2 కోట్లతో సామాజిక సేవలు

బెంగళూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 317 ఎఫ్ ద్వారా ఏడాది లోగా 1.20 కోట్ల రూపాయలతో సామాజిక సేవలు కొనసాగించదలిచినట్టు ఫస్ట్ వైస్‌డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజుచంద్రశేఖర్, సెకండ్ వైస్‌డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయకుమార్‌లు ప్రకటించారు. వైద్యసేవలు, విద్య సామాజిక సంక్షేమంతోపాటు జీవనోపాధులకు సహకారం అందించదలిచామన్నారు. 8లక్షల రూపాయల విలువ చేసే 8 ల్యాప్‌టాప్‌లు, రూ.8 లక్షల ప్రోత్సాహకాలతోపాటు బ్యాగ్ వెండింగ్ మిషన్‌లు పేద కుటుంబాలకు అందించదలిచామన్నారు. స్వయం ఉపాధి కోసం 4 ఎలక్ట్రికల్ ఆటోలను, 2 జూపిటర్ స్కూటర్‌లను అందించదలిచామన్నారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆకాశ్ ఏ సువర్ణ, ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ జేపీ సింగ్, వంశీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రన్యారావు కేసులో... డీజీపీగా రామచంద్రరావు పునర్నియామకం



రామచంద్రరావు

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో ప్రమేయం ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో తప్పనిసరి సెలవుపై వెళ్లిన నటి రన్యారావు పెంపుడు తండ్రి కే రామచంద్రరావు డీజీపీగా (డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) మళ్ళీ నియమితులయ్యారు. రాష్ట్రప్రభుత్వం సోమవారం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. బంగారం అక్రమ రవాణా కేసులో రన్యారావు అరెస్టు అయిన విషయం విదితమే. పోలీస్ ప్రోటోకాల్ దుర్వినియోగం చేశారనే వివాదంలో మార్చి 15న రామచంద్రరావును తప్పనిసరి సెలవుపై పంపిన విషయం విదితమే.

ఐవీఎఫ్ బేబీ గుర్తింపుపై జాతీయస్థాయిలో చైతన్యం

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ గర్భధారణకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో గెస్ ది ఐవీఎఫ్ బేబి పేరిట అపోలో ఫెర్టిలిటీ జాతీయస్థాయిలో చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి డైరెక్టర్ విజయ్ అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. అపోలో ఫర్టిలిటీ నవజాతశిశువు ఆరోగ్యం, ఎదుగుదల, గర్భధారణ విధానంతోపాటు అన్ని అంశాలలోనూ తల్లిదండ్రులకు సమగ్ర సమాచారం ఇవ్వదలిచామన్నారు. సాంకేతికంగా సంతానోత్పత్తి ఎంపికల విషయంలో దంపతులకు సమగ్ర సమాచారం ఇవ్వదలిచామన్నారు. దేశవ్యాప్తంగా 12 నగరాలలో నేరుగాను, డిజిటల్ రూపంలో చైతన్యం కలిగించనున్నట్టు తెలిపారు. అపోలో హెల్త్‌స్టైల్ మార్కెటింగ్ అధికారి నిశాంత్ మిశ్రాతోపాటు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి లింబావళికి మాతృవియోగం



బీమాబాయి(ఫైల్)

మహదేవపుర, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అరవింద లింబావళి తల్లి బీమాబాయి వెంకటరావు లింబావళి (84) కన్నుమూశారు. వయోసహజ సమస్యలతో బాగల్కోటెలోని నివాసంలో సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస వీడారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రికి పలువురు సానుభూతి వ్యక్తం చేశారు.

మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన నరసమ్మ మాడగిరి



బాధ్యతలు స్వీకరిస్తున్న నరసమ్మ

రాయచూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాయచూరు మహానగర పాలికెమేయర్‌గా నరసమ్మ మాడగిరి తిరిగి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మహానగర పాలిక రెండవ టర్మ్ పదవి కాలానికి సంబంధించి అధ్యక్షురాలిగా ఎన్నికైన నరసమ్మ మాడగిరి జులై 9న సెలువు పై వెళ్లారు. దీంతో అప్పటి వరకు వైస్ ఛైర్మన్‌గా ఉన్న సాజీద్ సమీర్ ఇంచార్జ్ మహానగర పాలిక మేయర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తిరిగి 32 రోజుల అనంతరం ఆమె సోమవారం ఎదావిధిగా బాధ్యతలు స్వీకరించారు. కాగా నరసమ్మ మాడగిరి సెలవుపై వెళ్లిన సందర్భంగా పలు రాజకీయ ఊహాగానాలకు ఆస్కారం ఏర్పడింది. అప్పట్లో ప్రతిపక్షానికి చెందిన నాయకులు ఆమె బలవంతంగా సెలవుపై వెళ్లారంటు ఇక తిరిగి రారంటు పలు రకాలుగా వ్యాఖ్యాలు చేశారు. ఈ క్రమంలో తిరిగి ఆమె బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. కాగా రాయచూరు మహానగర పాలిక రెండవ టర్మ్ అధికార అవధి ఈ ఏడాది నవెంబరు నెలాఖరుతో ముగియనుంది. అప్పటా వరకు ఆమె అధ్యక్షురాలిగా కొనసాగనున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



శివరాజ దొరె(ఫైల్)

రాయచూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దేవదుర్గ తాలూకా ఆల్కోడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఔడలగుడ్డకు చెందిన శివరాజ దొరె(38) సోమవారం విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడ్డాడు. ఆల్కోడ్ గ్రామ సమీపంలోని కాలువలో ఉన్న మోటార్‌ను మరమ్మత్తు చేసే ప్రయత్నంలో నీళ్లలోకి దిగిన ఆయనకు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడే మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడ వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపి వేసి శవాన్ని కాలువ నుంచి బయటికి తీయాల్సి వచ్చింది. అరకేరా పోలీసులు సంఘటన స్థళాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అగ్ని వీర్ నియామక ర్యాలీకి 764 మంది హాజరు

రాయచూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో వాయు సేనలోని అగ్ని వీర్ నియామక ర్యాలీకి నాల్గవ రోజు సోమవారం 764 మంది అభ్యర్థులు హాజరైయ్యారు. మొత్త 860 మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకోగా హాజరైన వారు 764 మందిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో 484 మందికి 1600 మీటర్‌ల రన్నింగ్ రేస్‌లో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,632.60
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	31,980	36,739
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	31,775	54,960
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	104.18

హెడ్‌కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

● డ్రైవర్‌పై దాడి కేసులో ఎస్పీ ఉత్తర్వులు



హెడ్‌కానిస్టేబుల్ మంజునాథ్

బళ్లారి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా వద్ద కేఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామలింగప్పను దాడగి చేసి హెడ్‌కానిస్టేబుల్ మంజునాథ్‌ను జిల్లా ఎస్పీ అరుణా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హరిహర్ నుంచి బళ్లారికి వెళ్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు డ్రైవర్ కానిస్టేబుల్ ద్విచక్రవాహనానికి సైడు ఇవ్వలేక పోవడంతో పాటు వాహనాన్ని బస్సుతో తగిలించాడనే కారణంతో కానిస్టేబుల్ డ్రైవర్ పై దాడిచేశారు. హెడ్‌కానిస్టేబుల్ పై కూడ్లిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసున మోదు కావడంతో హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

పొగాకు నిల్వలపై దాడులు

● బిల్లులు లేని ఎనిమిది టన్నులు స్వాధీనం



పొగాకు నిల్వలను పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి

బళ్లారిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని గుగ్గిరెట్టి ప్రాంతంలో హనుమాన్ అనే వ్యక్తి నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన పొగాకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జరిగిన దాడుల్లో ఎటువంటి పత్రాలు లేకుండా ఆంధ్రలోని కర్నూలు జిల్లా ఆలూరు నుంచి తెచ్చిన ఎనిమిది క్వింటాళ్ల పొగాకును ఎస్పీ డాక్టర్ శోభారాణి, డీఎస్పీ చంద్రకాంతనందరెడ్డి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ నేతృత్వంలో గుగ్గిరెట్టి ప్రాంతానికి చేరుకుని ఇంట్లో నిల్వ వుంచిన ఎనిమిది టన్నుల పొగాకును స్వాధీనం చేసుకున్నారు. హనుమాన్‌తో పాటు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన కాశిరావు అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ సామగ్రి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు

బళ్లారి సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుగ్గరహట్టి పారిశ్రామిక ప్రాంతంలో దుకాణాలపై దాడులు జరిపిన మున్సిపల్ అధికారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జరిగిన దాడిలో మొత్తం 1.400 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ. 50,000 జరిమానా విధించారు. దాడుల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పర్యావరణ) సీనియర్ జూనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్లు , మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

● గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి ● తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తేరాదు : జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగప్ప



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్నిప్రారంభిస్తున్న నాగప్ప

బళ్లారి సిటీ,ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను, పిల్లలను రక్షించడానికి అందరూ నడుం బిగించాలని జిల్లాబాలల సంరక్షణ అధికారి నాగప్ప పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా బాలల రక్షణ విభాగం, బాలల సహాయ కేంద్రం , పోలీస్ శాఖ విద్యాశాఖల సహకారంతో నగరంలోని ఆంద్రాల్ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలు, పోక్సోచట్టం, మూఢనమ్మకాలు, బాలల హక్కుల పరిరక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 లేదా పోలీసు హెల్ప్‌లైన్ 112 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రత్నాదేవి మాట్లాడుతూ బాల్యవివాహ అవగాహన కార్యక్రమం గురించి తెలుసుకున్న తర్వాత విద్యార్థులు బాల్య వివాహాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాలల సంరక్షణ అధికారి చన్నబసప్ప పాటిల్ మాట్లాడుతూ చదువు మానేసిన పిల్లలు బాల్య వివాహాలు, బాల కార్మికులు, బిక్షాటన, అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. అటువంటి పిల్లలను గుర్తించి వారి హక్కులు ఉల్లంఘించబడకుండా చేసుకోవడం వారికి సంరక్షణ పోషణ,పునరావాసం కల్పించడం జిల్లా బాలల రక్షణ యూనిట్ లక్ష్యం అన్నారు. ఈసందర్భంగా లీగల్ ఇన్స్పెక్టర్ ఈశ్వరరావు, పోలీసు నవదుర్గి బృందంలోని విద్యాబార్కి , అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నందిని, గాయత్రి, జిల్లాబాలల రక్షణ యూనిట్ సిబ్బంది నీలోపీయా, చంద్రకళ, ఆరోగ్యశాఖ సిబ్బంది. ఆశా-అంగన్‌వాడీ కార్యకర్తలు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ఘనంగా నిర్వహించాలి



● జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్

బళ్లారి సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకల్లోభాగంగా గ్రామీణ ప్రజల్లో నీరు, పారిశుద్ధ్యం గురించి అవగాహన కల్పించడానికి ఆగస్టు 15వరకు జిల్లాలో హర్ ఘర్ తిరంగ, హర్ ఘర్ స్వచ్ఛతా స్వాతంత్ర్య ఉత్సవ్ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ తెలిపారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, కేంద్ర తాగునీరు పారిశుద్ధ్య శాఖ, జల్ శక్తి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచారం స్వేచ్ఛ యొక్క పరిశుభ్రత, నీటి సామర్థ్యం లక్ష్యాలతో మిళితం చేయడం ద్వారా పౌరుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇది నీరు పారిశుద్ధ్యం, పరిశుభ్రత వ్యవస్థలను బలోపేతం చేయడం గ్రామీణ ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీరు. స్థిరమైన పారిశుద్ధ్యం, మెరుగైన పరిశుభ్రతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలోని అన్ని తాలూకా గ్రామ పంచాయితీల అధికారులు ,సిబ్బంది ఈ ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప నిరసన



నిరసనలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, బీజేపీ నాయకులు

సిరుగుప్ప, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): యాభై యేళ్లనుంచి పొలాన్ని సాగు చేసుకుంటున్న రైతులకు తీరని అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిరుగుప్ప తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ రైతులకు జీవనోపాధి కల్పించే పొలాలల్లోకి వారినే అనుమతించకపోవడం తగదన్నారు. నాగేశ్వరరావు, శ్రీనివాసరావు అనే ఇద్దరు వ్యక్తులు రైతులకు అడ్డుకుంటున్నారని, సాగురైతులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. రైతులపై దౌర్జన్యం, గూండాగిరి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోఎవాలని డిమాండ్ చేశారు.

రేపు ఇందిరా క్యాంటీన్ ప్రారంభం



నూతనంగా నిర్మించిన ఇందిరా క్యాంటీన్

కంప్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని కర్మాగారాలు పట్టణముగా పేరు పొందిన కుడితిని పట్టణంలో పేద ప్రజలకు కోసం ఏర్పాటు చేసిన ఇందిరా క్యాంటీన్ బుధవారం ఎంపీ తుకారాం, ఎమ్మెల్యే అన్నపూర్ణ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పట్టణ పంచాయతీ అధ్యక్షులు సుజాత, సత్యప్ప స్థాయి సమితి అధ్యక్షులు రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరా క్యాంటీన్ ఏర్పడటం వల్ల ఎంతోమందికి అనుకూలమవుతుందన్నారు. రూ. ఐదుకే ఉపహారం, రూ. పది లకు భోజనం దొరుకుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నిరు. వీటితో పాటు రూ. ఏడు కోట్లతో విద్యుత్ శాఖ కార్యాలయం నుంచి బైపాస్ రోడ్డు వరకు డివైడర్ నూతన రోడ్డు పనులకు భూమిపూజ, 19వ వార్డులో ఐదు లక్షల నీళ్ల ట్యాంకుకు భూమిపూజ, నూతనంగా నిర్మించిన మూడు అంగన్‌వాడీలు, పాతబస్టాండ్ వద్ద గాంధీ విగ్రహాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దేవరాజ అరసు జయంతిపై సన్నాహక సమావేశం

సిరుగుప్ప, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ దేవరాజు అరసు జయంతిని ఘనంగా ఆచరించేందుకు అందరి సహకారం అవసరమని బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ కే మల్లికార్జున కోరారు. సోమవారం సిరుగుప్ప పట్టణం టీడీపీ భవనంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ ఆధ్వర్యంలో ఆగస్టు 20వ తేదీన జరుగనున్న డాక్టర్ దేవరాజు అరసు 110వ జయంతిను ఘనంగా ఆచరించేందుకు పూర్వాపరాల సిద్దత సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు, సంఘ సంస్థ పదాధికారులు పాల్గొని చర్చించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

కంప్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రావణ సోమవారం పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో ముక్తినాథేశ్వర స్వామికు ప్రత్యేక పూజలు జరిపారు. కంప్లి పట్టణంలోని పేట బసవేశ్వరస్వామిని పుష్పాలతో ప్రత్యేకాలంకరణ చేపట్టి పూజలు చేశారు. అంతకుముందు ఉదయం తుంగభద్ర నదిలో గంగ పూజలు నిర్వహించి అక్కడి నుండి పేట బసవేశ్వర స్వామి ఆలయం వరకు స్వామివారిని బసవన్నతో ఊరేగించారు. 19వ వార్డులో యల్లమ్మ దేవస్థానం వద్ద బసిరి చెట్టు నాగప్పకు భక్తాదులు సోమవారం పురస్కరించుకుని పూజలు జరిపారు. కొట్టూరులో బసవేశ్వర స్వామికు శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.



అలంకరణలో ముక్తినాథేశ్వరుడు



పేట బసవేశ్వరస్వామి



ఊరేగింపులో బసవన్న



బసిరి చెట్టు నాగప్ప



కొట్టూరు బసవేశ్వరుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

పొగాకు రహిత జిల్లాగా మార్చాలి

పల్లెల్లో అవగాహన కల్పించాలి: డీహెచ్ఓ రమేశ్

బళ్లారి సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పొగాకు వ్యసన రహిత కేంద్రం యొక్క సౌకర్యాల గురించి అధికారులు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని. జిల్లాను పొగాకురహితంగా మార్చాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు.. సిబ్బందికి సూచించారు. రాష్ట్ర పొగాకు నియంత్రణ విభాగం, జిల్లాపరిపాలన, జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా పొగాకు నియంత్రణ సెల్ సహకారంతో నగరంలోని జిల్లా ఆరోగ్యకుటుంబ సంక్షేమ అధికారుల హాల్లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఆరోగ్య కార్యకర్తల కోసం పొగాకు వ్యసన రహిత కేంద్రంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొగాకు నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను రూపొందించిందని, పొగాకు వ్యసన రహిత కేంద్రంలో కౌన్సెలింగ్,పొగాకుకు బానిసలైన వ్యక్తులకు ఉచిత ఎన్‌ఆర్‌టీ చికిత్స సౌకర్యాలు గురించి సమాజంలో అవగాహన కల్పించాలన్నారు.

జిల్లా సర్వేయర్ డాక్టర్ మరియంబి మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల ప్రభావితమైన వారు ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు1800-112-356 టోల్ ఫ్రీ నంబర్‌కు (మంగళవారం నుంచి ఆదివారం వరకు) కాల్ చేసి సలహాలు పొందవచ్చన్నారు. అదేవిధంగా టెలిమానస్ హెల్ప్‌లైన్ నెంబర్ 14416కు కాల్ చేయడం ద్వారా కూడా సేవలు పొందవచ్చన్నారు. బెంగళూరులోని పొగాకు వ్యసనం రహిత సెంట్రల్ స్టేట్ యూనిట్‌కు చెందిన డివిజనల్ కో ఆర్డినేటర్ మహంతేశ్ , ప్రోగ్రామ్ మేనేజర్ రాజేశ్ ఇండియన్ రిసోర్స్ పర్సన్‌లుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నిర్మూలన అధికారిణి డాక్టర్ ఇంద్రాణి,జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, గోవిందప్ప, డాక్టర్ జబిన్‌తాజ్, ప్రశాంత్‌కుమార్, మల్లేశప్ప పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై చలో బెంగళూరు

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు



మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

బళ్లారిరూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యలపై 'చలో బెంగళూరు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. సోమవారం బళ్లారి నగరంకలెక్టర్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న పత్రిక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు పింఛన్ పక్క రాష్ట్రాలతో పోల్చుకుంటే చాలా తక్కువగా వుందని, కేవలం రూ.500 మాత్రమే దారుణమన్నారు. ఆంధ్ర, తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో పింఛన్ రూ. ఆరు 6000 అందజేస్తున్నారన్నారు. అక్టోబరు నెలలో చలో బెంగళూరు, ఛలో రాజభవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పింఛన్ రూ.5000 చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు ప్రభుత్వం ద్వారా ఎలా పంపిణీ చేస్తారో వ్యవసాయం సంబంధించిన ట్రాక్టర్లు తదితర సామగ్రిని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రంగప్ప, దాసరి కేంద్ర కమిటీ సభ్యులు మంజునాథ, హెబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

16న కృష్ణాష్టమి వేడుకలు

బళ్లారి సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణజయంతిని ఈ నెల16న ఘనంగా నిర్వహిస్తున్నట్లు సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ బి.నాగరాజు తెలిపారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ , మున్సిపల్ కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 16న ఉదయం 11గంటలకు నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డులోని బీడీఏఏ ఫుట్ బాల్ మైదానం హాల్లో శ్రీ కృష్ణజయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాన్ని గృహనిర్మాణం, వక్ఫ్, మైనార్టీ సంక్షేమ మంత్రి ,బళ్లారి ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ప్రారంభిస్తారు.బళ్లారినగర ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి అధ్యక్షత వహిస్తారు. హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ ఎస్.గణేశ్,ఎంపీ తుకారం, బసవరాజ్ హిట్నాల్, నాసిర్ హుస్సేన్, రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర, ఎమ్మెల్యే అన్నపూర్ణ, ముండరగి నాగరాజు,మేయర్ ముల్లంగి నందీశ్, హామీపథకాల అథారిటీ ఛైర్మన్ చిదానందప్ప, కోర్పోరేట్ పి.గాదెప. జిల్లాఎస్పీ శోభారాణి తదితరులు పాల్గొంటారన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారులను అభినందిస్తున్న మఠం మేనేజర్ ప్రసన్నాచార్, శ్రీధర్

బళ్లారి సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆరాధన పురస్కరించుకుని సత్యనారాయణపేట బళ్లారి రాఘవేంద్ర మఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన రాఘవేంద్ర వైభవ సాంస్కృతిక ఉత్సవం భక్తులను తన్మయ పరించింది. రాఘవేంద్ర స్వామిపై భక్తిగీతాలకు చేసిన నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. తుంగ-గంగా సాంస్కృతిక కళాసంఘం కళాకారులు రాఘవేంద్ర వైభవం ప్రహ్లాద అవతారం కోలాటం భక్తిగీతాలు తదితర ప్రదర్శనలు రంజింపజేశాయి. కళాకారులను ప్రముఖులు శ్రీధర్, క్రిష్ణాచార్యులు జ్ఞాపిక ప్రశసాపత్రాలను అందజేసి, సత్కరించారు. నాట్యచారిణి శ్రీజకు తుంగ నాట్య కళా రత్న పురస్కారాన్ని అందజేశారు. మేనేజర్ ప్రసన్నాచార్, మాజీ కార్పోరేటర్ నేమకల్ రావు, గిరి, అనంత నాగభూషణం పాల్గొన్నారు.

దార్శనికుడు నులియ చందయ్య

● జయంతి వేడుకల్లో అభ్యుదయ భావకుడు అనంత నాయక్

హోస్పేట,ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): విశ్వగురు బసవన్న వచన ఉద్యమంలో ప్రముఖ దార్శనికుడు వచన రయిచత నులియ్యా చందయ్య కీలక పాత్ర పోషించారని, దేశ కాయక వర్గానికి గుర్తింపు అని అభ్యుదయ భావకుడు అనంత నాయక్ అభిప్రాయపడ్డారు. స్థానిక అమరావతి గృహ సముదాయంలో సోమవారం నిర్వహించిన వెనుకబడిన తరగతుల స్నేహపూర్వక సమావేశంలో శరణ నులియ చందయ్య జయంతిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చందయ్య తన పని పట్ల విధేయత ఆ పని ద్వారా వచ్చే ఆదాయం బానిసత్వానికి తన సమయాన్ని అంకితం చేసిన గొప్ప స్ఫూర్తిదాయకులు అన్నారు. ఆయన అదర్శాలు ఎందరికో అనుసరణీయం అన్నారు. కార్యక్రమంలో వెనుక బడిన తరగతుల మహాకూటమి నాయకులు గౌవీ భరమన్న, ఇర్ఫాన్ ముదగల్, గౌడసోమశేఖర్‌పాటిమనేని, రామచంద్రప్ప, బానాడ గణేష్, శివ కుమార్, స్లమ్‌వెంకటేశ్, వీరభద్రప్ప నాయక్, సన్న మారెప్ప, ప్రమోద పుణ్యమూర్తి, చలవాడి మహాసభ సన్న మారెప్ప, జయప్ప ఈరన్న, గిరిష్, తిమ్మారెడ్డి, గాయకుడు యల్లప్ప భండారి, తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

సబ్ కలెక్టర్‌గా ఆకృతి సేథి



బాధ్యతలు స్వీకరించిన ఆకృతిసేథి

హోసూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు 83వ సబ్ కలెక్టర్‌గా ఆకృతిసేథి బాధ్యతలు స్వీకరించారు. ఆమె సేలం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ట్రెయినీ కలెక్టర్‌గా పనిచేశారు. ఆమె హర్యానాలోని అంబలాకాంట్‌కు చెందినవారు. రాష్ట్ర బాస్కెట్‌బాల్ క్రీడాకారిణిగా కూడా గుర్తింపు పొందారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ హోసూరులోని ముఖ్యమైన రోడ్లకు అనుబంధంగా ఫుట్‌పాత్‌లను నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా వ్యవహరిస్తానన్నారు. పారిశామ్రిక నగరమైన హోసూరు నగరం కర్ణాటక రాజధాని బెంగళూరుకు సమీపంలో ఉందన్నారు. హోసూరుకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు.

కొళాయిల్లో కలుషిత నీరు

రాయచూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 21వ వార్డు దేవినగర్‌లో కలుషితమైన తాగునీరు సరఫరా కావడంతో స్థానికులు ఆందోళనకు గురైయ్యారు. ఈ వార్డులో రెండు రోజులకొక సారి తాగునీటి విడిస్తుండగా గడచిన ఐదు రోజులుగా నీరు అందలేదని స్థానికులు వివరించారు. ఆరవ రోజు విడిచిన నీరు సహితం పూర్తి కలుషితంగా ఉండడంతో తాగలేకపోతున్నట్లు తెలిపారు. వాడకానికి ఉపయోగించాలన్నా నీటి పరిస్థితి చూసి చర్మరోగాలు వస్తాయేమన్న భయం ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ పరిస్థితి సోమవారం ఎల్‌బీఎస్ నగర్ లోను చోటు చేసుకున్నట్లు పలువురు ఆరోపించారు.



కొళాయిల్లో వస్తున్న కలుషిత నీరు



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న మేయర్ సత్య

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

హోసూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నేపథ్యంలో నులిపురుగుల నియంత్రణకోసం ఆల్బెండజోల్ మాత్రలను 115 పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. హోసూరు కార్పొరేషన్ కామరాజ్ కాలనీ ప్రాంతంలోని కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 19ఏళ్ల వయసుగల 93వేల మంది విద్యార్థులకు, 20-30 ఏళ్ల మహిళలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. హోసూరు చుట్టుపక్కల ప్రాంతాలలోని 42 పాఠశాల సహా 115 విద్యాసంస్థలలో మాత్రలు పంపిణీ చేశారు. కామరాజ్ కాలనీలో ఏర్పాటైన కార్యక్రమంలో మేయర్ సత్య మాత్రలు అందచేశారు. మాత్రలు వాడడం ద్వారా నులిపురుగుల సమస్య తొలగిపోతుందని, రక్తహీనత, శారీరక, మానసిక అలసట నివారించబడతాయన్నారు. డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జోనల్ కమిటీ ఛైర్మన్ రవి, కౌన్సిలర్ మొహిసిన్ తాజ్‌నిసార్, మునిసిపల్ వెల్ఫేర్ ఆఫీసర్ పాల్గొన్నారు.

జీడిమామిడి సాగుపై రైతుల ఆసక్తి



విరగ్గాసిన జీడిమామిడి కాయలు

హోసూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతం పూలు, కూరగాయల సాగుకు ఎంతో ప్రసిద్ధి. తాజాగా జీడిమామిడి సాగుపై కూడా రైతులు ఆసక్తి చూపుతున్నారు. డెంకణీకోట్టై, బాగలూరు, ఉరిగాం, తళి, ఉద్దనపల్లి వంటి ప్రాంతాలలో రైతులు విస్తారంగా జీడిమామిడి సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా వాటర్ యాపిల్స్ అని వ్యవహరిస్తుంటారు. తెలుపు, ఆకుపచ్చ, గులాబీ, పసుపు రంగులలో జీడిమామిడి ఉంది. స్థానికంగా కంటే పొరుగున ఉండే కర్ణాటకలోనూ వీటికి డిమాండ్ ఉందని రైతులు అంటున్నారు. కొండ ప్రాంతాలలో ఈ రకం ఎక్కువగా పండిస్తున్నారు. ఒక మొక్క రెండేళ్లకు కాపు వస్తుందని, ఒక మొక్కకు 50-100 కిలోల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. రుచికరమైన, ఔషధగుణాలను కల్గిన ఈ రకానికి కిలో రూ.60-100 చొప్పున ధర ఉంటోందన్నారు.